

పొంచి ఉన్న ప్రమాదం

బుగ్గారం: యశ్వంతరావుపేట గ్రామ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కుంట ప్రమాదకరంగా మారింది. చిన్న పరిమాణంలో ఉన్న ఈ కుంట నుంచి మొరం కోసం గతంలో తవ్వకాలు జరపగా.. లోతుగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సమీపంలోని గుట్టల నుంచి వచ్చే వర్షం నీటితో క్రమంగా నిండుతోంది. ఈ కుంటను ఆనుకొని ఉన్న రెండు వరుసల రహదారి వెల్గటూర్ మండలం వరకు ఉంది. కుంట ఉన్న ఈ ప్రాంతంలో మలుపు సైతం ఉండడంతో వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ఇందులో పడిపోయే ప్రమాదముంది. ఈ మార్గంలో నిత్యం అనేక వాహనాలు వెళ్తుంటాయి. అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే తగిన భద్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వరి నారుతో జై కేసీఆర్

కథలాపూర్: సిరికొండ గ్రామానికి చెందిన దొప్పల జలందర్ అనే రైతు కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువలోకి నీరు వదిలి పంటలను కాపాడాలని సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వరి నారుతో జై కేసీఆర్, కాళేశ్వరం రివర్స్ పంపింగ్ అని రాసి కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ నీరు వరద కాలువలో ఎల్లవేళలా అందుబాటులో ఉండేవని, భూగర్భ జలాలు పెరిగి పంటలకు సమృద్ధిగా నీరు అందేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో వరద కాలువలో నీరు అడుగంటిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలకు నీరందించే పరిస్థితి లేదని వాపోయారు.



కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయ సమీపంలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను పంచాయితీ సిబ్బంది సోమవారం తొలగించారు. జూన్ 30న సాక్షిలో డ్రైనేజీల్లో చెత్త అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పంచాయతీ సిబ్బందితో చెత్త తొలగించారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

జగిత్యాలజోన్: జగిత్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను మంగళవారం ఉదయం 10 గంటలకు ధరూర్ క్యాంప్‌లోని కార్యాలయ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్: ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీజీటీ జువాలజీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ సోమవారం తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 10 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9618774635 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జగిత్యాల: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హులైన వారి నుంచి విదేశాల్లో ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తోందని ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ తెలిపారు. షార్జాలో గ్లాస్ పనులు ఖాళీగా ఉన్నాయని, ఉద్యోగానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. టామ్‌కామ్ వారు ఈనెల 10న జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నమోదు డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలని సూచించారు.

పుస్తకాలు అందజేత

ఇబ్రహీంపట్నం: గోధూర్, తిమ్మాపూర్, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, మూలరాంపూర్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 127 మంది పేద విద్యార్థులకు సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. సురిగి శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, వేముల రవీందర్‌రెడ్డి, గురుడు శ్రీకాంత్, చింటు రవితేజ, సాయిప్రశాంత్, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

మెట్‌పల్లి: మసీదుల నిర్వహణకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మైనార్టీ నాయకుడు షేక్ మహమ్మద్ సోమవారం ధర్మపురిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా ఈ నిధుల మంజూరును నిలిపివేయడంతో నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త ఓటర్లుగా నమోదు చేయాలి

ఇబ్రహీంపట్నం: 18 ఏళ్లు నిండిన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షకులు లింబగిరి స్వామి, శివప్రసాద్, వినోద్, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా నారాయణ

ఇబ్రహీంపట్నం: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.నారాయణను నియమించగా.. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మండల ప్రత్యేకాధికారిగా పని చేసిన డీఆర్‌డీవో పీడీ రఘువరన్‌ను మల్యాల మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. నారాయణను ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రామకృష్ణరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చెక్కు అందజేత

రాయికల్: రామాజీపేట గ్రామానికి చెందిన ఆర్మూర్ లక్ష్మికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చొరవతో రూ.56వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రాగా.. సోమవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గంగారెడ్డి, హరీశ్‌రావు, రాజురావు, సుధీర్‌రెడ్డి, కోల రాజు పాల్గొన్నారు.

పరామర్శ

ధర్మపురి: ధర్మపురికి చెందిన బండి మురళి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం బాధితుడి ఇంటికొచ్చి పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఇందారపు రామన్నను పరామర్శించారు.

మొహర్రం వేడుకలు



ఇబ్రహీంపట్నం: బర్దీపూర్‌లో పులి వేషంతో గ్రామస్తుల సందడి



మల్యాల: పాల్గొన్న ప్రజలు



పెగడపల్లిలో పెద్ద పులి వేషధారణలో..



కథలాపూర్: బొమ్మెనలో..



కోరుట్ల: చినమెట్‌పల్లిలో..

గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీరీలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. పెద్ద పులి వేషధారణతో సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సారంగాపూర్: యువకుల పెద్ద పులి వేషం



పెద్ద పులి వేషధారులతో జీవన్‌రెడ్డి

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం సంగెంపల్లిలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి సోమవారం పర్యటించారు. మొహర్రం కావడంతో పెద్ద పులి వేషధారులు జీవన్‌రెడ్డిని చుట్టుముట్టారు. కాసేపు నృత్యాలు చేయడంతో జీవన్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.



రాయికల్: గోరింటాకుతో మెప్మా మహిళలు



మెట్‌పల్లి: చేతులకు మైదాకు పెట్టుకున్న మహిళలు

గోరింటాకు వేడుకలు

రాయికల్: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో సిబ్బంది, ఆర్పీలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైదాకు పెట్టుకుంటూ సరదాగా గడిపారు. టీఎంసీ శరణ్య, శ్రీనిధి మేనేజర్ రాణి, ఆర్పీలు జయసుధ, రమ్య, అనిత, సుమలత, రవళి, అనూష తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: సిరికొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలు సోమవారం నిర్వహించారు. విద్యార్థులు చేతులకు వివిధ ఆకృతుల్లో గోరింటాకు పెట్టుకొని ప్రదర్శించారు. హెచ్‌ఎం వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మెప్మా ఆర్పీలు, మున్సిపల్ మహిళా సిబ్బంది తమ చేతులను మైదాకుతో అలంకరించుకున్నారు.



కథలాపూర్: చేతులకు పెట్టుకున్న మైదాకు చూపిస్తున్న విద్యార్థులు

కాలభైరవ ఆలయంలో మంత్రి అడ్లూరి పూజలు



గొల్లపల్లి: రంగధాముని‌పల్లెలో గల కాలభైరవ ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం రంగదేవునిపల్లె గ్రామాన్ని సందర్శించారు. వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన తోట గంగవ్వకు రూ.75 వేలు, ఇస్రాజ్‌పల్లెకు చెందిన అంబటి రాజన్నకు రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీ మంజూరు పత్రాలు అందజేశారు. నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమనానరు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, ఇస్రాజ్‌పల్లె మాజీ సర్పంచ్ చిర్రా గంగాధర్, ఉప సర్పంచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

రాయికల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు. బాపురపు నర్సయ్య, తలారి రాజేశ్, వేణు, బాలరాజ్, సాయికుమార్, భూమేశ్, వెంకటేశ్, రాజేశ్, ప్రకాశ్, అనిల్, శ్రీనివాస్, మల్లేశ్, నరేశ్ పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. జిల్లా ఇన్‌చార్జి మురళి, కాశవత్తుల లక్ష్మిరాజం, మారంపెల్లి వినోద్, మిట్టపెల్లి కిషన్, తెడ్డు అంజయ్య, రవి, ప్రభాకర్, స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంతోపాటు మానాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నలువాల సంజీవ్ జెండా ఎగరేశారు. మోత్కుల నర్సయ్య, గుడిసె రవి, మల్యాల ఈశ్వర్, తోడేటి బాబు, మునుగూరు శంకర్, పూడూరు స్వామి, సిద్దంకి లింగయ్య పాల్గొన్నారు.



రాయికల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జిలు మురళి, శ్రీనివాస్, నాయకులు బాలె శంకర్, రాజ్‌కుమార్, కిషన్, సతీశ్, శ్రీనివాస్, ముత్తు, దివాకర్, సతీశ్, రమేశ్, స్వామి పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద జెండావిష్కరించారు. అంజయ్య, మహేందర్, శాంత, వనిత, అంజమ్మ, భూమయ్య, బాబు, లక్ష్మణ్, రాజు. శ్రీనివాస్, మహేశ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యాయత్నం

మల్యాల: భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనతో ఓ వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ముత్యంపేట దిగువ కొండగట్టులో చోటుచేసుకుంది. మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గుడిసెల గట్టయ్య సోమవారం దిగువ కొండగట్టులోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ సురేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

మెట్‌పల్లి: పట్టణంలోని 9వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాన్ని సోమవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఆ కట్టడాన్ని తొలగించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ సంబంధిత యజమాని స్పందించలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దానిని తొలగించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ అశోక్, టీపీబీఓలు రాజేశ్, యమున, నితిక ఉన్నారు.

పని గంటల పెంపు జీవో రద్దు చేయాలి

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన పని గంటల పెంపు జీవోను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జీవో కాపీలను దహనం చేశారు. 8 గంటల పని దినాలను 10 గంటలకు పెంచుతూ జీవో నం.282 విడుదల చేశారన్నారు. సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ చంద్రశేఖర్, అన్వేషిత, నారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్



కోరుట్ల: పట్టణానికి చెందిన బెజ్జారపు వైష్ణవి ఐసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 2,670 ర్యాంక్ సాధించింది. విద్యార్థి వైష్ణవి కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులో ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి



జగిత్యాలజోన్: లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలని లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ భద్రేశ్వరం అన్నారు. జగిత్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు అడ్లగట్ల శంకర్, కార్యదర్శి గంగాధర్, కోశాధికారి శ్రీహరితో ప్రమాణ స్వీకారం చేయించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

జగిత్యాల: అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతిచోట సైన్‌బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు ప్రదేశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో జిల్లా ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరోను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు, ఆర్డీవోలు, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

జగిత్యాల: ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ముఖ్రం అన్నారు. సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. మౌలానా, సుతారి రాములు, శాంత, గణేశ్ పాల్గొన్నారు.

ధర్మపురి: ఈనెల 9న పంచాయతీ కార్మికుల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య పిలుపునిచ్చారు. ధర్మపురిలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. మండల అధ్యక్షురాలు నల్ల సునీత, ఉపాధ్యక్షుడు మదిరె గోపాల్, ముదుగం రాజలింగు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

రాయికల్: ఇటిక్యాల గ్రామానికి చెందిన క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళ వైద్యం కోసం సోమవారం గ్రామంలోని 2007–08 పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.31వేల ఆర్థిక సాయం అందజేశారు.

నిరుపేద విద్యార్థికి..

మల్లాపూర్: నిరుపేద విద్యార్థినికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ చేయూతనిచ్చారు. రాఘవపేటకు చెందిన కుంచపు గాయత్రికి హైదరాబాద్‌లోని కోటి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో సీటు రాగా.. హాస్టల్‌లో చేరేందుకు రూ.15వేల ఫీజు ఆ నిరుపేద కుటుంబానికి భారమైంది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, స్థానిక నాయకుల సహకారంతో రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

మేడిపల్లి: మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో ఉమ్మడి మేడిపల్లిస్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం నిర్వహించారు.

జూనోసిస్ దినోత్సవం

మెట్‌పల్లి: పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. స్థానిక పశు వైద్య సిబ్బందిని సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. లూయిస్ పాశ్చర్ తయారు చేసిన యాంటీ రేబీస్ టీకాను 1885 జూలై 6న మొదటిసారి వినియోగించి సఫలీకృతమైనందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఆ రోజును ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వేములవాడ చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

మల్యాల: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ప్రచారం చేస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా ఏటా మొక్కలు నాటుతున్నానని పర్యావరణ ప్రేమికుడు పుల్లె సత్యనారాయణ అన్నారు. కొండగట్టుకు వెళ్లే ఘాట్ రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. కరీంనగర్‌లోని ఆర్టీసీ వర్క్‌షాప్‌లో మెకానిక్‌గా ఉద్యోగం చేస్తున్న సత్యనారాయణ(59) ఘాట్ రోడ్డుకిరువైపులా గుంతలు తవ్వించి సుమారు 500 మొక్కలు నాటారు. పదేళ్లుగా వేలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. ఏటా సుమారు రూ.10వేలు వెచ్చించి మొక్కలు నాటుతున్నానన్నారు.



మొక్కలు నాటుతున్న సత్యనారాయణ

ప్రలోభాలతో లొంగదీసుకోవడం సిగ్గుచేటు

మల్లాపూర్: ప్రలోభాలతో బీఆర్ఎస్ నాయకులను లొంగదీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. వేంపల్లి గ్రామాధ్యక్షుడిగా కల్లెడ గంగాధర్, వెంకట్రావ్‌పేట గ్రామాధ్యక్షుడిగా ఆరే పెద్దిరెడ్డిని ఎన్నుకున్నారు. మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, రైతుబంధు కమిటీ మాజీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మాజీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బిట్ల నరేశ్, నాయకులు న్యామతేబాద్ రాజు, మచ్చర్ల దశరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో పోచమ్మ బోనాలు

కొడిమ్యాల: సింగపూర్‌లో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కొడిమ్యాల మండలానికి చెందిన యువకులు బోనాల సంబరాలు నిర్వహించారు. శ్రీహర్ష కేశవ గుడిలో భక్తిశ్రద్ధలతో పోతరాజు, పులి వేషాలతో బోనాలు సమర్పించారు. సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నగేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించాలి

జగిత్యాల: విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని సాధించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో తెలంగాణ ఎడ్యుకేషన్ ఫైర్ ఆధ్వర్యంలో ఎంసెట్ తర్వాత ఉత్తమ చదువులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ రవీందర్, ప్రభాకర్, నర్సయ్య, ఆర్జీఏ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యోతి

వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. సోమవారం మోచీ సంఘం ఆధ్వర్యంలో దాదాపు 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మోచీ సంఘం అధ్యక్షుడు రాజయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, చంద్రశేఖర్, సాయితేజ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు అభినందన

జగిత్యాలరూరల్: పొరండ్ల జెడ్పీ పాఠశాల విద్యార్థులు బోదనపు అంకిత, గుర్రం కీర్తన, ఓదెల కావేరి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వారిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సన్మానించారు. వచ్చే విద్యాసంవత్సరం మరింత మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రామ్‌మనోహర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కరీంనగర్‌లోని ఉజ్వల పార్క్ సమీపంలో చేప పిల్లల పెంపకాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాటికి శ్రీహరితో కలిసి పరిశీలించారు.

అర్హులను లబ్ధిదారులుగా గుర్తించడం లేదు

జగిత్యాల: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులను లబ్ధిదారులుగా గుర్తించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐ జిల్లా సెక్రటరీ వెన్న సురేశ్ లేఖ రాశారు. వార్డు సభలు నిర్వహించి అర్హులైనవారికి అందేలా చూడాలన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

జగిత్యాలక్రైం: బీర్‌పూర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజు, ధర్మపురి–2 ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం ఎస్సై ఎం.శ్రీధర్‌రెడ్డిని మేడిపల్లికి, వీఆర్‌లో ఉన్న గొంగాటి సతీశ్‌ను బుగ్గారం ఎస్సైగా నియమించారు. ఒకట్రెండు రోజుల్లో మరో నలుగురు ఎస్సైలకు బదిలీలు కానున్నట్లు సమాచారం.

ముదిరాజ్ సంఘ అధ్యక్షుడిగా బాజన్న

కోరుట్ల: ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా తుపాకుల బాజన్న సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అలువాల రవి, ప్రధాన కార్యదర్శిగా పాతర్ల సురేశ్, కోశాధికారిగా గుండవేణి గంగారెడ్డిని ఎన్నుకున్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

జగిత్యాలరూరల్: జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు దూడ తిరుపతి అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

జగిత్యాల: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. సోమవారం అటనమస్ హోదా పొందిన తర్వాత నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ సెమిస్టర్ ఫలితాలను ఆయన ప్రకటించారు. మొత్తం 225 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 158 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రమోద్‌కుమార్, వరప్రసాద్, సంగీతరాణి పాల్గొన్నారు.